# అవసరం మేరకే రసాయనాలు వాడాలి

- ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పర్యావరణ, సహజ వనరుల విభాగం డైరెక్టర్ వాణి
- పంటల మార్పిడి, చెట్ల పెంపకంపై రైతులకు అవగాహన



చేవెళ్ల రూరల్ : కార్యక్రమంలో మాట్లాడుతున్న జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ పర్యావరణ, సహజ వనరుల విభాగం డైరెక్టర్ వాణి

చేవెళ్ల రూరల్, మే 6 : అవసరం మేరకే రసాయనాలు వాడాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ పర్యావరణ, సహజ వనరుల విభాగం డైరెక్టర్ డాక్టర్ వాణి సూచించారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ముంగిల్లో శాస్త్రవేత్తలు (రైతులకు అవగాహన) కార్యక్రమం మంగళవారం చేవెళ్ల మండల పరిధి చన్‌వెల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వాణి, హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రజిని హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్కువ యూరియా వాడాలని, అవసరం మేరకు మాత్రమే రసాయనాలను వినియోగించాలన్నారు. మందులు కొన్న రసీదులు భద్రపర్చుకోవాలని, సాగు నీటిని ఆదా చేయాలన్నారు. పంటల మార్పిడి, చెట్ల పెంపకంపై, వివిధ రకాల పూలు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి రమ్య, పరిశోధన విద్యార్థులు కె.భువన, సాధియా, గ్రామానికి చెందిన దాదాపు 50 మంది రైతులు, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు జె.శివానందన్, మాజీ ఎంపీటీసీ పి.దీపక్ రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.

## పంట మార్పిడితో సుస్థిర ఆదాయం

**జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అలీబాబా, చిరంజీవి**



కనకమామడిలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

**మొయినాబాద్ :** పంట మార్పిడితో రైతులు సుస్థిర ఆదాయం పొందే అవకాశం ఉందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అలీబాబా, చిరంజీవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులకు పంటల సాగు, ఎరువుల వాడకం, పంట మార్పిడి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటకు అవసరమైన మేరకే రసాయనాలు వినియోగించాలన్నారు. రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఏఈవో కుమార్, మాజీ ప్రజాప్రతినిదులు, రైతులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావును మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దండెం రాంరెడ్డి
-పెద్దఅంబర్‌పేట, మే 6

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

- జాబితాల రూపకల్పన పారదర్శకంగా ఉండాలి
- గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్

వికారాబాద్, మే 6 : అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా జాబితాలను రూపొందించాలని గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక, ధ్రువీకరణ ప్రక్రియపై కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవో, ధ్రువీకరణ గెజిటెడ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ద్వారా వచ్చిన జాబితాలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి కుటుంబాల స్థితిగతులను పరిశీలించి పారదర్శకంగా జాబితాలను రూపొందించాలని అధికారులకు సూచించారు. జాబితాల ధ్రువీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సుధీర్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఎస్‌హెచ్‌వో సత్తార్, హౌసింగ్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

### పిల్లల దత్తత చట్టబద్ధంగా ఉండాలి

**వికారాబాద్ :** పిల్లలు లేని దంపతులు చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని వికారాబాద్ శిశుగృహలో పెరుగుతున్న ఎనిమిదేండ్ల అబ్బాయికి సంబంధించి ఇటలీకి చెందిన దంపతులకు దత్తత ఉత్తర్వులను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చట్టానికి వ్యతిరేకంగా పిల్లలను తీసుకోవడం నేరమన్నారు. పిల్లలను దత్తత తీసుకోవడానికి జిల్లా సంక్షేమ శాఖ పరిధిలోని శిశు గృహ వికారాబాద్‌లో సంప్రదించాలని సూచించారు. దత్తత స్వీకరణలో భాగంగా జిల్లా సంక్షేమ అధికారి జయసుధ, సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటేశం, బీఆర్బీ కోఆర్డినేటర్ కాంతారావు, డీసీపీవో శ్రీకాంత్, శిశు గృహ మేనేజర్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల జీవితాలతో ప్రభుత్వాల చెలగాటం

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**



ఎల్లమ్మతండాలో ఉపాధికూలీలతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

మంచాల, మే 6 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం చట్టాలను కాలరాస్తూ కూలీల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. మంగళవారం మంచాల మండల పరిధిలోని ఎల్లమ్మతండాలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను సీపీఎం ఆధ్వర్యంలో ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీలో కొలతలు లేకుండా పనులు చేయించాలన్నారు. రోజు రూ.600 ఇవ్వడంతో పాటు 200 రోజుల పని దినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. వేసవి దృష్ట్యా కూలీలతో సులభమైన పనులు చేయించాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు నీడతో పాటు తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటుతో ఉంచడంతో పాటు గడ్డపార, గంపలను ప్రభుత్వమే పంపించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ.. 15రోజులకోసారి ఉపాధి హామీ బిల్లులు కూలీలకు చెల్లించాలన్నారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శామ్యూల్, జగదీష్, నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంజయ్య, జగన్, మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాం సుందర్, జంగయ్య, యాదయ్య, బుగ్గరాములు, వెంకటేశ్, మంతని జంగయ్య, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రావులపల్లిలో ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు



వాహనాలను తనిఖీ చేస్తున్న ప్రత్యేక బృందం సభ్యులు

కొడంగల్, మే 6 : అక్రమ రవాణా నియంత్రణకు మండల పరిధిలోని రావులపల్లిలో ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. కర్ణాటక నుంచి తెలంగాణకు వడ్లు అక్రమ రవాణా కొనసాగుతుందని రావులపల్లి అంతర్రాష్ట్ర రహదారి బార్డర్‌లో ఈ చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణలోని వడ్ల కొనుగోలు కేంద్రాలకు కర్ణాటక వడ్లను తరలిస్తున్న క్రమంలో ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. కార్యక్రమంలో ఏఈవో ఐజాక్, పోలీసులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- వికారాబాద్ డీఈవో రేణుకాదేవి
- ఎన్కతలలో వేసవి శిబిరం సందర్శన



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న డీఈవో రేణుకాదేవి

వికారాబాద్, మే 6 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి తెలిపారు. మంగళవారం మోమిన్‌పేట మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవిలో చదువుకు దూరం కారాదనే ఉద్దేశంతోనే ఈ వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరంలో ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా గ్రామల్లోని మహిళా సంఘాలు, యువకులు, రైతులు అందరూ సహకరించాలని సూచించారు. అనంతరం వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి శిక్షణ ఫౌండేషన్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు గౌరీ శంకర్, శ్రీనివాస్ రెడ్డి, విద్యాశాఖ పరిశీలకులు రజిని, డీఆర్‌డీవో ఏపీవో రాజు, పాఠశాల చైర్‌పర్సన్ కళావతి, పాఠశాల హెచ్‌ఎం దండు రమేశ్, ఉపాధ్యాయులు అనురాధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలి

**సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రావు**



మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రావు

మొయినాబాద్, మే 6 : వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రావు అన్నారు. ఆ దిశగా వయో వృద్ధులకు పథకాలను అమలు చేయాలన్నారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్‌లో తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007 నియమావళిపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, వయోవృద్ధులను చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉంటుందని చెప్పారు. పిల్లలు స్థిరపడిన తర్వాత తల్లిదండ్రులను వదిలి విదేశాల్లో స్థిరపడడం... లేదా స్థానికంగానే ఉంటూ తల్లిదండ్రులను పట్టించుకోకపోవడం చట్ట విరుద్ధమన్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధులను ఇబ్బంది పెట్టినా.. బాధపెట్టిన వారి పోషణ, సంక్షేమ చట్టం-2007 ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. వృద్ధుల రక్షణ చట్టాలను ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ పాండుగౌడ్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు సత్తయ్య, ఉపేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు కొంపల్లి అనంతరెడ్డి, ఎల్గని చంద్రలింగంగౌడ్, మాజీ ఎంపీపీలు కంజర్ల భాస్కర్, కండిక రమేశ్, మాజీ సర్పంచ్‌లు సంగరి మల్లేశ్, హనుమంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చిరాగ్ మోహన్‌గౌడ్, సీనియర్ సిటిజన్లు సయ్యాజీ రావు, గోపాల్‌రెడ్డి, సుగుణాకర్‌రావు, మల్లారెడ్డి, కృష్ణమోహన్, బల్వంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణల తొలగింపు



చిలుకూరులోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెలిసిన నిర్మాణాన్ని జేసీబీతో తొలగింపజేస్తున్న రెవెన్యూ అధికారులు

మొయినాబాద్, మే 6 : హైదరాబాద్ శివారులో భూముల విలువ అమాంతం పెరగడంతో కబ్జాదారుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామ రెవెన్యూలోని సర్వేనంబర్ 49 లోని ఎకరం ప్రభుత్వ భూమిని కొందరు దర్జాగా కబ్జా చేసి అక్రమంగా రెండు గదులను నిర్మించారు. ఈ విషయం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందడంతో.. మంగళవారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్ నేతృత్వంలో ఆర్‌ఐలు రోజా, రాజేశ్‌లు రెండు బృందాలుగా వెళ్లి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుని జేసీబీల సాయంతో కూల్చివేసి స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలం విలువ సుమారు రూ.15 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. అదేవిధంగా చిలుకూరు గ్రామ రెవెన్యూలోని సర్వేనంబర్ 457లోని ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి కబ్జా చేసి షెడ్ నిర్మించగా.. తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ఆదేశానుసారం ఆర్‌ఐ రోజా, రెవెన్యూ సిబ్బంది, స్థానిక పోలీసుల సహకారంతో షెడ్‌ను కూల్చివేయించారు. ఆ షెడ్‌కు ప్రభుత్వ భూమి నుంచి వేసిన రోడ్డునూ ధ్వంసం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది బాలకృష్ణ, ఎల్లయ్య, వాటర్‌వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఎవరైనా కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

- డీసీపీ సునీతారెడ్డి
- ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



యాచారంలో ప్రజలతో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

యాచారం, మే 6: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం యాచారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న తీరును ఆమె పరిశీలించారు. వాహనదారులు, ప్రయాణికులకు రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్, మోటర్ వెహికిల్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు జరిగే రోడ్డు ప్రమాదాల నుంచి హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందన్నారు. హెల్మెట్ ధరించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు సీటు బెల్టును ధరించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. నంబర్ ప్లేటు లేని వాహనదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసులు, వాహనదారులు ఉన్నారు.



మండల పరిధిలోని గుంతపల్లిలో ఉన్న అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ఉన్నత మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి. - అబ్దుల్లాపూర్‌మెట్, మే 6

### ఓయూ ఫిజిక్స్ విభాగం హెడ్‌గా ప్రొఫెసర్ ప్రసాద్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం హెడ్‌గా ప్రొఫెసర్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఓయూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని ఓయూ వీసీ చేతుల మీదుగా ప్రొఫెసర్ ప్రసాద్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, అధికారులు, పరిశోధిక విద్యార్థులు అభినందించారు.

### ఎంపీఈడీ పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంపీఈడీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవాలని సూచించారు.



సబితారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## న్యాయమే గెలిచింది

- సంబంధం లేని కేసులో ఇరికించారు
- నిరాధారమైన ఆరోపణలు చేశారు
- 12 సంవత్సరాలు మనోవేదనకు గురయ్యాను
- మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్ పేట్, మే 6: న్యాయవ్యవస్థపై తాను ఉంచిన నమ్మకం నేటి తీర్పుతో రుజువైందని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. 12 సంవత్సరాల నిరీక్షణకు తెరపడిందన్నారు. ఓబుళాపురం మైనింగ్ కేసులో సీబీఐ కోర్టు తనను నిర్దోషిగా ప్రకటించిన నేపథ్యంలో సబితారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఎంతోమంది ఈ విషయాన్ని రాజకీయంగా వాడుకోవాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు సంబంధం లేకున్న ఈకేసులో తనను ఇరికించారని.. ఎన్నో అవమానాలను భరించానని ఆవేదన చెందారు. కష్టకాలంలో నియోజకవర్గం, జిల్లా ప్రజలు తన వెంటే ఉన్నారని.. వారి ప్రేమే నన్ను ఇంకా ప్రజాసేవలో నిలిచేలా చేసిందన్నారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని తనకు నమ్మకం ఉండేదని.. అది నేటితో రుజువైందన్నారు. తనకు అండగా నిలిచిన ప్రజలందరికీ సబితారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు

**సబితారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం..**

కోర్టు తీర్పును హర్షిస్తూ మీర్‌పేటలో సబితారెడ్డి చిత్రపటానికి బీఆర్ఎస్ నేత అర్కల కామేశ్ రెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు.. భూపేశ్ గౌడ్, శీనూనాయక్, దీప్లాల్ చౌహాన్, సిద్దాల బీరప్ప, అనిల్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, రాజ్ కుమార్, సునీతాబాలరాజ్, విజయలక్ష్మి, సుర్వి లత, మదారి రమేశ్, గోపీయాదవ్, లక్ష్మణ్, సిద్దాల అంజయ్య, వెంకట్ రెడ్డి, సహదేవ్, అవినాశ్, శేఖర్ గౌడ్, రజాక్, జగాల్ రెడ్డి, వెంకటేశ్, రామకృష్ణ, యాదగిరి, నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ తదితరులు పాల్గొన్నారు.



ఓబుళాపురం మైనింగ్ కేసులో సీబీఐ కోర్టు సబితారెడ్డిని నిర్దోషిగా తీర్పునిచ్చిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం కడ్తాల్ మండల కేంద్రంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తును పటాకులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. - కడ్తాల్, మే 6

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కొందుర్గు, మే 6 : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం భూభారతి చట్టంపై కొందుర్గు మండల పరిధిలోని శ్రీరంగాపూర్, ఉత్తరాసిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. రైతులు భూములకు సంబంధించిన ఏమైనా పత్రాలు ఉంటే లిఖితపూర్వకంగా దరఖాస్తు అందజేయాలని సూచించారు. అధికారులు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సరిత, తహసీల్దార్లు రమేశ్‌కుమార్, జగదీశ్వర్, ఎంపీడీవో లక్ష్మిఅనురాధ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ సాధిక్, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎండీ జహంగీర్, పురుషోత్తంరెడ్డి, మల్లేశ్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి



బిజ్వార్ - బొంకూరు బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న అధికారులు

తాండూరు రూరల్, మే 6 : మండల పరిధిలో చేపడుతున్న బ్రిడ్జి, బీటీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మంగళవారం బిజ్వార్-బొంకూరు మధ్య కాగ్నా వాగుపై రూ.4.85 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జి పనులు, రూ.1.55కోట్లతో నిర్మించే బీటీ పనులను పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యతగా చేపట్టాలన్నారు. ఆయన వెంట ఈఈ సత్యనారాయణ రెడ్డి, డీఈఈ నాగభూషణం, ఏఈ నందిని తదితరులు ఉన్నారు.